క్లుప్తంగా

నేడు యనమలకుదురులో మంత్రి జోగి పర్యటన

పెనమలూరు:నేడు యనమలకుదురులో రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పర్యటించనున్నారు. ఆయన బుధవారం సాయంత్రం 4.30 గంటలకు యనమల కుదురు చిన్న వంతెన నుంచి కాలినడకన ఎన్నికల ప్రచారం చేస్తారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని మంత్రి కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తిచేసింది.

నేడు పలు గ్రామాల్లో మంత్రి జోగి పర్యటన

కంకిపాడు:మండలంలోని పలు గ్రామాల్లో రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి జోగి రమేష్ ఈనెల 8వ తేదీన విస్తృతంగా పర్యటించనున్నారు. ఈ మేరకు మంత్రి జోగి రమేష్ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. బుధవారం ఉదయం 8 గంటలకు కోమటిగుంట లాకులు, 9 గంటలకు జగన్నాథ పురం, 10గంటలకు క్రిస్టియన్‌పేట, 11 గంటలకు కందలంపాడు గ్రామాల్లో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి ప్రతిపక్షాలు సాగిస్తున్న కుట్రలపై ప్రజలను చైతన్యం చేయనున్నారు. ఎన్నికల ప్రచారాన్ని విజయవంతం చేయాలని, ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని ఆ ప్రకటనలో కోరారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 242 వినియోగం




పెనమలూరు:పెనమలూరులో నాల్గవ రోజు మంగళవారం పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ఓటర్లు వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేయటానికి రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు పెనమలూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పెనమలూరు పాఠశాలలో 103 మంది పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేశారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఉన్న పోలింగ్ కేంద్రంలో 139 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 242 ఓట్లు పోల్ అయ్యాయి. హోం ఓటర్లలో 374 ఓట్లకు గాను 366 ఓట్లు పోల్ అయ్యాయి. హోం ఓటర్ల గడువు ముగిసిందని అధికారులు తెలిపారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



హనుమాన్‌జంక్షన్‌రూరల్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, ప్రతి పౌరుడు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని హనుమాన్‌జంక్షన్ సీఐ అల్లు నవీన్ నరసింహమూర్తి అన్నారు. ఎంపవరింగ్ యూత్ ఫర్ డెమోక్రటిక్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ రూపొందించిన ప్రచార పోస్టర్లను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఎన్నికల్లో ప్రలోభాలకు తలొగ్గకుండా దేశ ప్రగతి కోసం ఆలోచించి ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల్లో కుల, మత, ప్రాంతీయ తత్వాలకు ప్రజలు గురికాకుండా చైతన్య వంతులను చేసేందుకు, యువతను రాజకీయంగా ప్రోత్సహించేందుకు ఎంపవరింగ్ యూత్ ఫర్ డెమోక్రటిక్ ఇండియా సంస్థ చేస్తున్న కృషిని సీఐ అభినందించారు. ఆ సంస్థ ప్రతినిధి మజ్జి బాబు అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

భక్తులందరికీ కుంకుమ ప్రసాదం పంపిణీ చేపట్టాలి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులందరికీ కుంకుమ ప్రసాదం అందేలా చూడాలని ఈవో కె.ఎస్. రామారావు ఆలయ అధికారులకు సూచించారు. మహా మండపం ఆరో అంతస్తులో జరుగుతున్న కుంకుమ ప్యాకెట్ల తయారీని ఈవో మంగళవారం పరిశీలించారు. కుంకుమ ప్యాకింగ్ చేస్తున్న విధానం గురించి అడిగి తెలుసుకోవడమే కాకుండా కుంకుమ నాణ్యతను పరిశీలించారు. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులు తొలుత అమ్మవారి దర్శనం ప్రశాంతంగా జరగాలని చూస్తారని, ఆ తర్వాత అమ్మవారి కుంకుమ ప్రసాదం దొరికితే మహా ప్రసాదంగా భావిస్తారన్నారు. దేవస్థానం చేపట్టిన ఉచిత కుంకుమ ప్రసాద పంపిణీని మరింత విస్తృతంగా జరిగేలా చూడాలన్నారు. ముఖ్యంగా శుక్ర, శని, ఆదివారాలలో భక్తులందరికీ కుంకుమ ప్రసాదం అందేలా అవసరమైన ప్యాకెట్లను సిద్ధం చేసి ఆలయంలో అందుబాటులో ఉంచాలన్నారు. రోజుకు ఎన్ని ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నారు... ఎంత మంది సేవలకు తమ సేవలను అందిస్తున్నారనే వివరాలను ఏఈవో ఎన్.రమేష్‌బాబు ఈవోకు వివరించారు.

పెనమలూరులో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలివే!

- 49 కేంద్రాలను గుర్తించిన పోలీసులు
- పోరంకి, యనమలకుదురులో మరికొన్ని సమస్యాత్మక కేంద్రాలను గుర్తించాలని స్థానికుల అభ్యర్థన



పోరంకిలో గత ఎన్నికలలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు(ఫైల్)

పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గంలో 49 అత్యంత సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను పోలీసులు గుర్తించి ఎన్నికల అధికారులకు వివరాలు పంపారు. అయితే ఇంకా పోరంకి, యనమలకుదురులో పలు పోలింగ్ కేంద్రాలపై పోలీసులు దృష్టి పెట్టలేదన్న విమర్శలు వస్తున్నాయి. వివరాల్లోకి వెళితే... పెనమలూరు నియోజకవర్గంలో 306 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. పెనమలూరులో 168, కంకిపాడులో 64, ఉయ్యూరులో 74 పోలింగ్ కేంద్రాల చొప్పున ఉన్నాయి. పోలీసులు ప్రకటించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో పెనమలూరులోని కానూరు కృష్ణనగర్ పాఠశాలలో 1,3,5,7 కేంద్రాలు, యనమలకుదురు లంబాడీపేట జెడ్పీ హైస్కూల్‌లో 48, 59, 60, 61, 62, 63 కేంద్రాలు, పెనమలూరు పల్లిపేట స్కూల్‌లో ఉన్న 131, 132, 133, 134, 135 కేంద్రాలు ఉన్నాయి. కంకిపాడు మండలంలో మద్దూరు పాఠశాలలో 168, 169 కేంద్రాలు, ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలలో 193, 194, 195, 196, 197 కేంద్రాలు, కంకిపాడు జెడ్పీ పాఠశాలలో 179, 180, మంతెన మండల పరిషత్ పాఠశాలలో 206, 207 కేంద్రాలు, ఉప్పులూరు ఆర్ సీఎం పాఠశాలలో 200, 201 కేంద్రాలు ఉన్నాయి. ఉయ్యూరు మండలంలో గండిగుంటలో 281, 282 కేంద్రాలు, ఉయ్యూరు టౌన్‌లో సిద్ధార్థ జూనియర్ కాలేజీలో 251, 252, 253, 254, 255, 256, 257, 263, 264, 265 కేంద్రాలు, ఆకునూరులో 231, 232, 233 కేంద్రాలు, చిన ఓగిరాల ఎంపీపీ పాఠశాలలో 237, 238 కేంద్రాలు, కాటూరులో 286, 287, 288, 289 కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు.

పోరంకి–యనమలకుదురులో మరికొన్ని...

పోరంకి యనమలకుదురు గ్రామాల్లో పలు పోలింగ్ కేంద్రాలపై పోలీసులు దృష్టి పెట్టలేదు. యనమలకుదురు మండపం సెంటర్‌లో ఉన్న మండల పరిషత్ పాఠశాలలోని 66, 68 కేంద్రాలు, పాత పంచాయతీ భవనంలో ఉన్న 70 నుంచి 75 కేంద్రాల్లో గత ఎన్నికల్లో గొడవలు జరిగాయి. ఇక పోరంకిలో 101 అంగన్‌వాడీ కేంద్రంలో పోలింగ్ కేంద్రం, సీతాపురం కాలనీలో సంవిధ విద్యాపీఠ్ పాఠశాలలో ఉన్న 118 నుంచి 122 వరకు ఉన్న పోలింగ్ కేంద్రాల్లో దొంగ ఓట్ల నివారణకు పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాల్సి ఉంది. లేని పక్షంలో ఈ ప్రాంతంలో గొడవలు జరిగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. కానూరు సనత్‌నగర్‌లో టీడీపీ మద్దతుదారుడైన రౌడీషీటర్ గత కొద్ది రోజులుగా హల్‌చల్ చేస్తున్నా పోలీసులు పట్టించుకోవటం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

జగనన్నతోనే సంక్షేమ పథకాల అమలు



యనమలకుదురులో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

పెనమలూరు: జగనన్న అధికారంలో ఉంటేనే పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు జరుగుతాయని పెనమలూరు గ్రామ సర్పంచి లింగాల భాస్కరరావు అన్నారు. ఆయన మంగళవారం పెనమలూరు గ్రామంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న అధికారంలోకి వచ్చిన తరువాతే గ్రామ స్వరాజ్యం వచ్చిందన్నారు. పేదలకు అనేక సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయని తెలిపారు. పెనమలూరులో 3 గ్రామ సచివాలయాలు నిర్మాణం చేశామని, గ్రామాల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గ్రామ సచివాలయాలు ఉత్తమ సేవలు అందిస్తున్నాయని తెలిపారు. గంగూరులో మాజీ ఎంపీటీసీ అక్బర్‌పాషా, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు.

యనమలకుదురులో...

యనమలకుదురులో లాకుల వద్ద నుంచి వంతెన వరకు మైనార్టీ నాయకుడు షేక్ అష్రఫ్, బీసీ సంఘ రాష్ట్ర కార్యదర్శి కోసూరి నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేశారు. ప్రజలు తిరిగి జగన్‌ను సీఎం చేయాలని కోరారు. పెనమలూరులో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేసి జోగి రమేష్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు సలీం, లంకా కోటేశ్వరరావు, లతీఫ్, గుమ్మడి నాగరాజు, మాదు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ బిందుమాధవి



కుందేరులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నందిపాటి బిందుమాధవి, పార్టీ నేతలు

కంకిపాడు: సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ నందిపాటి బిందుమాధవి అన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం కుందేరు గ్రామంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. మచిలీపట్నం ఎంపీగా సింహాద్రి చంద్రశేఖర్‌రావు, పెనమలూరు ఎమ్మెల్యేగా జోగి రమేష్‌ను గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కలకోట లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, భీమవరపు నరేష్‌రెడ్డి, తాతినేని కిషోర్, ఎర్రమల్లి రాజేష్, కలకోట లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడులో ఇంటింటి ప్రచారం

వైఎస్సార్ సీపీ విజయాన్ని కాంక్షిస్తూ పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు మంగళవారం కంకిపాడులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, సర్పంచ్ బాకీ రమణ, నాయకులు కంకిపాటి రమేష్, జి.ఇంద్రజ, వడ్డాది లీల, టి.మరియబాబు తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన అందించిన సీఎం జగన్

వైఎస్సార్ సీపీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్



బాపులపాడులో ప్రచారం నిర్వహిస్తున్న గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఐదేళ్ల పాటు సుపరిపాలన అందించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి రాజకీయాలకు అతీతంగా మద్దతు పలకాలని ఆ పార్టీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ కోరారు. బాపులపాడు మండలంలోని వీరవల్లి, నారాయణపురం, కోడూరుపాడుతో పాటుగా హనుమాన్‌జంక్షన్‌లోని పలు ఏరియాల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు ఎదురేగి ఆయనకు సాదర స్వాగతం పలికారు. తీన్‌మార్ డప్పు వాయిద్యాలతో, పెద్ద ఎత్తున బాణసంచా పేల్చుతూ, పూలవర్షం కురిపిస్తూ వైఎస్సార్ సీపీ అభ్యర్థి వల్లభనేని వంశీకి గ్రామగ్రామాన అపూర్వ ఆదరణ లభించింది. అడుగడుగునా ఆయనకు బ్రహ్మరథం పట్టారు. ఆయా గ్రామాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు వంశీ పూలమాలలు వేసి నివాళి అర్పించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ప్రతి వీధిలోనూ మహిళలు హారతులు పట్టి అభిమానాన్ని చాటుకున్నారు. యువత బైక్ ర్యాలీతో ప్రచారంలో హోరెత్తించారు. జై జగన్, జై వంశీ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వంశీ ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తూ, అభివాదం చేస్తూ ముందుకు సాగారు. విప్లవాత్మక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా మద్దతు పలకాలని వంశీ కోరారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ రావాలన్నారు. ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గన్నవరం ఎమ్మెల్యే, మచిలీపట్నం పార్లమెంట్ స్థానాలను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, జేసీఎస్ మండల కన్వీనర్ అవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, సర్పంచ్ సరిపల్లి కమలాబాయి, పీఏసీఎస్ చైర్మన్ దయాల విజయ నాయుడు, మాజీ ఉప సర్పంచ్ కాకాని వెంకటేశ్వరరావు (బాబు), వైఎస్సార్ సీపీ నాయకులు కొమరవల్లి కిరణ్‌మూర్తి, కొల్లి వెంకట్రావు, గూడవల్లి రత్న సుధాకర్, కోడెబోయిన బాబి, మురళి పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ గీతాంజలిశర్మ పర్యవేక్షణలో మంగళవారం ఉదయం కట్టుదిట్టమైన భద్రత మధ్య పోస్టల్ బ్యాలెట్ల ఓటింగ్ ప్రారంభమైంది. సాయంత్రం వరకు జరిగిన ఓటింగ్‌లో 209 మంది ఉద్యోగులు, సిబ్బంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆర్వో, రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లకు సీల్ వేసి భద్రపరిచారు. గత నాలుగు రోజులుగా జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ల ఓటింగ్‌లో మొత్తం 1,477 మందికిగాను 1,313 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారని ఆర్వో తెలిపారు. మిగిలిన ఉద్యోగులు, సిబ్బంది బుధవారం సాయంత్రంలోపు పోస్టల్ బ్యాలెట్లను వినియోగించుకోవాలని సూచించారు. ఇతర జిల్లాల్లో ఎన్నికల డ్యూటీలు పడిన ఉద్యోగులు 164 మంది పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించాలని ఆర్వోను కోరారు. వీరి విజ్ఞప్తిపై స్పందించిన గీతాంజలిశర్మ సంబంధిత ఉద్యోగుల వివరాలను తమకు అందజేయాలని సూచించారు. సంబంధిత జిల్లాల ఆర్వోలతో మాట్లాడి వివరణ తీసుకున్న తర్వాత పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఉంగుటూరు తహసీల్దారు జేవీ సుబ్బారావు, డెప్యూటీ తహసీల్దార్లు షఫీ కుమార్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం

గన్నవరం: వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్‌రావు, డాక్టర్ వల్లభనేని వంశీమోహన్‌కు మద్దతుగా గ్రామాల్లో పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. స్థానిక పాతగన్నవరం, సగర్లపేట, సొసైటీపేటలో వార్డు సభ్యురాలు సూరం విజయలక్ష్మి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు పనిచేస్తున్న వంశీమోహన్‌ను, ఎంపీ అభ్యర్థి సింహాద్రిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు. కేసరపల్లిలో సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక ఆధ్వర్యంలో గడపగడపకు ప్రచారం చేశారు. గ్రామాభివృద్ధికి వంశీమోహన్ అందించిన సహకారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించారు. స్థానిక ఎస్సీ కాలనీ, బుద్ధవరం, అల్లాపురం, వీఎన్ పురం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నేతలు ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి

ఉంగుటూరు: మండలంలో పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్‌కు మద్దతుగా పార్టీ నాయకులు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవీఎంపై ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలో జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిజబెత్ రాణి అవగాహన కల్పించారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్‌రావు, ఎమ్మెల్యేగా వంశీమోహన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పెదఅవుటపల్లి, మానికొండ, తరిగొప్పల తదితర గ్రామాల్లో గ్రామ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ లాం దిబోర, సూర్రెడ్డి మణిమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు చౌటపల్లి దాసు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

విజయవాడరూరల్:వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం అంబాపురం, పి.నైనవరం, నున్న గ్రామాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేశారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ సీఎం గా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఫ్యానుగుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్, ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావులను అత్యధిక ఓట్ల మెజారీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.అంబాపురం గ్రామ పార్టీ కన్వీనర్ నల్లమోతు చంద్రశేఖర్, కోకన్వీనర్ తోడేటి బెంజిమెన్, పి.నైనవరం గ్రామ పార్టీ కన్వీనర్ దావు వెంకటేశ్వరావు, గ్రామ సర్పంచి బట్టా చిన్నబ్బాయి, మాజీ సర్పంచి దావు కోటేశ్వరరావు, నున్న గ్రామ పార్టీ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, స్థానిక పార్టీ శ్రేణులు, పోలింగ్ బూత్ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలో అన్ని వర్గాలకు సముచిత స్థానం

రామవరప్పాడు:వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తూ సంక్షేమం అందించారని నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం నిడమానూరులో వైఎస్సార్ సీపీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి జగనన్న సంక్షేమ పథకాలు వివరించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పరిమి సింధూర, అరవపల్లి భద్రయ్య, పరిమి విష్ణు, ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కొత్తగూడెం దాహార్తిని తీర్చిన వంశీ

- 70ఏళ్లుగా సరైన నీటికి నోచుకోని గ్రామం
- రూ.5 లక్షల సొంత నిధులతో వాటర్ ప్లాంటు ఏర్పాటు
- వంశీమోహన్‌కు రుణపడి ఉన్న గ్రామస్తులు



వల్లభనేని అరుణ చారిటబుల్ ట్రస్టు ద్వారా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంటు

గన్నవరంరూరల్: ఆ గ్రామంలో 70 ఏళ్ల దాహార్తిని తీర్చిన ఘనత గన్నవరం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్‌కే దక్కుతుంది. మండలంలోని కొత్తగూడెం గ్రామంలో 1300 మందికి పైగా జనాభా ఉన్నారు. మండలంలోనే అధికంగా పశు సంపద, గొర్రెలు, మేకలు ఉన్న గ్రామం అది. ఈ గ్రామంలో తాగునీటి కోసం ప్రజలు అల్లాడేవారు. తరతరాలుగా గ్రామం చివరిలో ఉన్న బావి ఒక్కటే తాగునీటికి ఆధారంగా ఉండేది. గ్రామంలో తాగునీటి ట్యాంకు ఉన్నా ఆ నీరు ఉప్పగా ఉండటంతో తాగేందుకు ఇష్టపడేవారు కాదు. దశాబ్దాలుగా ఈ ఇబ్బందిని గ్రామస్తులు భరిస్తూ వచ్చారు. అయితే వీరి ఇబ్బందులను తెలుసుకున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ ఈ గ్రామంలో ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందించేందుకు తన సొంత ఖర్చుతో వల్లభనేని అరుణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.5లక్షలకు పైగా నిధులు వెచ్చించి వాటర్ ప్లాంటును నిర్మించారు. దీంతో గ్రామస్తులకు ఇబ్బందులు తొలగాయి. ఒకప్పుడు సమీప గ్రామం చిక్కవరం కిలోమీటరు దూరం, వీరపనేనిగూడెం మూడు కిలోమీటర్లు దూరం వెళ్లి వాటర్ టిన్నులలో మంచినీరు తెచ్చుకునే వారు. ఆ ఇబ్బందులకు చెక్ పెడుతూ మండల పరిషత్ మరో రెండు లక్షలు వెచ్చించి నిరంతరం తాగునీటిని గ్రామస్తులకు అందిస్తుండటంతో కొత్తగూడెం గ్రామస్తులు డాక్టర్ వంశీకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

మా కష్టాలు తీర్చిన దేవుడు



మా గ్రామానికి తాగునీటి వసతి కల్పించిన డాక్టర్ వంశీ మేలు మరువలేనిది. ఎన్నో ఇబ్బందులు పడ్డాం. అయితే ఆయన మా కష్టాలు తీర్చిన దేవుడు.

–కొలుసు సాంబశివరావు, రైతు, కొత్తగూడెం

మా కడగండ్లు తీర్చారు



70 ఏళ్లుగా సరైన నీటికి నోచుకోని దుస్థితి మాది. బావి నీరు, ట్యాంకు నీరు తాగేవాళ్లం. మాకు మంచినీరు ప్లాంటు ఏర్పాటు చేసి వంశీ మా కడగండ్లు తీర్చారు.

–అంగడాల అర్జునరావు, రైతు, కొత్తగూడెం

3 కి.మీ. వెళ్లాల్సి వచ్చేది



మూడు కిలో మీటర్లు వెళ్లి మంచినీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నుంచి కాపాడారు. డాక్టర్ వంశీ వాటర్ ప్లాంటు పెట్టి మాకు మేలు చేశారు.

–తూంపాటి కోటేశ్వరరావు, రైతు, కొత్తగూడెం

జగనన్న వెంటే నాయీబ్రాహ్మణులమంతా నడుస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న కనకారావు, నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు

నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మల్కాపురం కనకారావు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నాయీ బ్రాహ్మణులకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించిన జగనన్న వెంటే రాష్ట్రంలోని నాయీ బ్రాహ్మణులమంతా నడుస్తామని నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మల్కాపురం కనకారావు అన్నారు. విజయవాడ సింగ్‌నగర్ లోని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని దేవాలయాల పాలక మండలి నుంచి టీటీడీ బోర్డు మెంబర్ల వరకు నాయీ బ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. గత ప్రభుత్వాలు నాయీబ్రాహ్మణులను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకున్నాయని అన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలోని నాయీ బ్రాహ్మణులు అంతా వెలంపల్లి శ్రీనివాసరావు గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపునకు తామంతా కష్టపడతామని తెలిపారు. ఆర్.గణపతి రావు, మల్లవరపు నరసింహారావు, దాక్షరపు రాము తదితరులు పాల్గొన్నారు.

300 మద్యం సీసాలు స్వాధీనం



పోలంపల్లి(వత్సవాయి): మండలంలోని పోలంపల్లి పంట పొలాల్లో బస్తాల్లో దాచి ఉంచిన 300 మద్యం సీసాలను ఎక్సైజ్ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. పొలాల్లో మద్యం సీసాలను నిల్వ చేశారనే సమాచారం తెలుసుకున్న ఎస్ఈబీ సీఐ మణికంఠ, తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి 300 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దర్యాప్తులో భాగంగా మద్యం దాచినవారి వివరాలను కనిపెట్టి వారిపై తగిన చర్యలు తీసుకుంటామని సీఐ వివరించారు.

సూర్యభగవానుడికి విశేష పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీ శివజ్ఞాన పీఠంలో మంగళవారం సూర్యభగవానుడికి విశేషంగా మందారం, నూరు వరహాలు, గులాబీ పూలు, శంకు పుష్పములతో పూజలు చేశారు. పీఠాధిపతి శివాచార్యస్వామి పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సూర్య భగవానుడి ఆశీస్సులు ప్రజలందరికీ అందాలని ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని పూజలు చేస్తున్నట్లు తెలిపారు.



ఉయ్యూరు సెంటర్‌లో వర్షం

హమ్మయ్య... చల్లబడింది

ఉయ్యూరు/కంకిపాడు: వేసవి ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు ఎట్టకేలకు సేద తీరారు. మండే ఎండల నుంచి ఉపశమనం లభించింది. వడగాడ్పులకు అల్లాడిపోయిన జనం ఊరట పొందారు. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై మబ్బులు కమ్మేసింది. ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షం కురిసింది. సుమారు గంటన్నరకు పైగా ఓ మోస్తరు వర్షం పడటంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. సాయంకాలం వేళ చల్లని గాలులు వీయటంతో పెనమలూరు నియోజకవర్గ ప్రజలు హమ్మయ్య అంటూ ఊరట చెందారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలోని కళావేదికపై మంగళవారం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను అలరించాయి. తెనాలికి చెందిన శ్రీలక్ష్మి కూచిపూడి నృత్య కళా కేంద్రం నిర్వాహకురాలు, నాట్యాచారిణి ఎ.వెంకటలక్ష్మి శిష్యులు మహాగణపతి, నమఃశివాయ, అంబ నీరాజనం, అష్టలక్ష్మి వైభవం, జయ జయ దుర్గ, మార్కండేయ విజయం, అర్ధనారీశ్వరం హనుమాన్ చాలీసా వంటి అంశాలకు చక్కని ఆహార్యం, అభినయంతో నృత్యం చేశారు. అనంతరం ఆలయ అధికారులు కళాకారిణులకు తీర్థప్రసాదాలు అందజేసి, అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు.